# గాజుబొమ్మ

రాధాయి కుటుంబంతో రెండు నెలలు ఉంటానని రావడం, కృష్ణమూర్తికి ఓ రెండు నెలలు సెలవు దొరకడం పిల్లలబాధ లేకుండా పార్వతితో హాయిగా ఊటీలో గడిపే అవకాశం కల్గడం అన్నీ కాకతాళీయంగా జరిగాయి.

రెండు నెలలపాటు నాగరికతని మరిచి హాయిగా ఇష్టం వచ్చినట్టు వుండొచ్చునని ఎంతో ఆశతో వుత్సాహంతో ఊటీకి ప్రయాణం అయ్యారు. అడిగినదే తడవుగా రావుగారు "తమ బంగళా యీ సీజన్ ఖాళీగానేవుంది అక్కడే వుండండి అంటూ హెచ్చరించారు. ఇంకేం లోటు? మాలి వంటవాడు —సమయానికి భోజనం - ఇదే ఇలా తలవు స్వర్గ ఛాయలు అనుకుని మహదానందం ప్రకటించింది పార్వతి.

కాని రావుగారి బంగళా చిన్న ఎత్తు రాజేంద్రభవనం అని, ఆ చుట్టు పక్కల యిళ్ళల్లోవాళ్ళు పరిచయం చేస్తేకాని పలకరని పార్వతి ఊహించలేకపోయింది. కబుర్లు లేకపోతే పత్యంమీద లంఖణం పెట్టినంత బాధపడే పార్వతికి యిది చాలా యిబ్బంది అనిపించింది. పోనిలే రెస్టుగా వుందాం అని సర్దుకుంది. పక్కనే వున్న ఇల్లు అందంగా వుంది. అందులో

వున్న భార్యాభర్తలు మరీ అందంగా వున్నారు. "చూశావా కృష్ణా! ఆవిడెంతబాగుందో" అంటూ వరండాలో సుతారంగా నిలబడిన సుందరాంగిని చూపించింది.

పార్వతికేసి ఎగాదిగా చూచి చిన్నగా ఎడం కన్ను మూసి తెరిచాడు కృష్ణమూర్తి.

పాతచీర, అమ్మమ్మలనాటి రవికె, దువ్వినట్టూ దువ్వనట్టూ, అల్లినట్టూ, అల్లనట్టూ వున్న జుట్టు, వంట వాడితో బాతాఖానీకొట్టి వచ్చినట్టుంది — ముక్కుమీద చిన్న మసి.

"ఓసారి నువ్వూ అద్దంలో చూసుకో పార్వతీ" నవ్వుతూ అన్నాడు కృష్ణమూర్తి.

"ఎలావున్నా ఫరవాలేదనేగా సెలవుపెట్టి రావటం" అంటూ చీరకొంగుతో కనబడిన మసితుడుచుకుంది పార్వతి. వరండా అంచుదాకా నడిచి పక్కింటివేపు చూసింది. లోపలి బాడీతో పోటీపడుతున్న వీపుమీద జాకెట్టు కన్పించింది పార్వతికి. పక్కనే కుర్చీలో కూర్చున్న మొగుడితో ఆవిడ ఏదో తీవ్రంగా చెపుతున్నట్టుంది. చేతులు తిప్పటం చూస్తే అలాగే వుంది.

అందంగా పెంచి రంగు వేసిన గోళ్ళు ఉదయపు ఎండలో మెరుస్తున్నాయి. కట్టిన సిల్కు చీరకుచ్చెళ్ళు నేలన పొరాడుతూ అందంగా ఉన్నాయి. చక్కని సిగ ఉవ్వెత్తున లేచి జాగ్రత్తగా నడవకపోతే వరండా అంచుని తగిలేలా ఉంది.

"ఇంత పొద్దుటే యింతబాగా ఎలా అలంకరించుకుంది చెప్మా!" వింత పడింది పార్వతి.

"అయినా ఎందుకు?" అనుకుంది.

"ఇలాంటి ప్రాంతాల్లో అవిడని ఉండనివ్వకూడదు, చూడా సింగారం" అని భర్తకి చెప్తున్నట్లుంది. తలెత్తి చూశాడా కుర్చీలో కూర్చున్న వ్యక్తి. భార్యతో ఏదో చెప్పాడు. "పోనిద్దూ ఎలా ఉంటేనేం హాయిగా ఉండడం కదూ ప్రధానం?" అన్నట్టున్నాడు. "మగవాళ్ళంతా ఇంతే" నన్నట్లు చరచర లోపలికి వెళ్ళిపోయిందావిడ.

పాపం, అవిడకి నిజంగా తలవంపులే. ఇంత అందమైన ఊటీలో ఆగర్భ శ్రీమంతులో అందాల రాణులో ఉండే ప్రాంతంలో తనలాంటి షుఖమరిగి ఉండడం తలవంపులే. అను కొని కూర్చుని పేపరు చదువుకుంటున్న కృష్ణమూర్తి తలనొక సారి నిమిరి లోపలికి నడిచింది.

కృష్ణమూర్తి పేపరు మడిచి లోపలికి నడిచాడు. వరం డాలో నిలబడ్డ సుందరాంగికి తల కొట్టేసినంత పని అయింది. "నడిచేవాళ్ళు, బస్సులో వెళ్ళేవాళ్ళు టూరిస్టులు యీ దారంట వెడతారు వీళ్ళిలా ఉంటే నవ్వుకోరూ" ఇదేం మనుషులు ఎక్కడ ఎలా ఉండాలో తెలియకపోతే యింకె క్కడికైనా వెళ్ళకూడదూ! అనుకుని అందంగా కుర్చీ లాక్కుని యింకా అందంగా జేరబడి కూర్చుంది.

ఓ టూరిస్టు బస్సు రానే వచ్చింది. హిప్పీలు అంద గత్తెలు. ముసలివాళ్ళు, కుర్రాళ్ళు, అంతా ఉన్నారు దాంట్లో. కిటికీలోంచి ఏం కనిపించిందో ఒకటే ఈలలు

వేశారు. పక్కింటి వేపు చూసింది సుందరాంగి. కిటికీలోంచి చేయి బయటికి పెట్టి ఊపుతున్నారు దంపతులు; వాళ్ళని చూస్తే ఆ ఈలలు. రామ! రామ! ముఖం కందగడ్డలా చేసుకుని అప్పటిదాకా వళ్ళో పెట్టుకున్న ఈలు ఆదరా బాదరాగా అందుకుంది సుందరాంగి. పక్కనే కూర్చున్న భర్తతో ఏమందో — అయనో క్షణం తటపటాయించి "పక్కన ఉన్నది ఎవరో కాదోయ్ ఓ ప్రముఖ రచయిత. పెళ్ళాం పేరుతో ప్రఖ్యాతి వహించాడే ఆయన." అన్నాడు. "ఛీ అది అబద్ధం అండీ. అవిడే రాస్తుందిట. వీరంటున్నది నిజమేనా?" కుతూహలంగా అడిగింది.

"నిన్న అలా షికారుకి వెడితే అక్కడ చెప్పారు." అన్నాడాయన పేపరులోంచి తల తీయకుండానే. నిజమే అయింటుందప్పుడు. నేనిప్పుడే వెళ్ళి పలకరించి వస్తాను. అంటూ భర్త మాటకోసం ఆగకుండా వేజ్‌లోని కొన్ని పువ్వులు అందుకొని పక్కింటి వేపు నడిచింది.

వరండా ఎక్కుతూంటే ఆమె కళ్ళబడిన దృశ్యంచూసి ముఖం జేవురించింది. అయినా చూడకుండా ఉండలేకపోయింది. కర్మ! ఇదే కాబోలు ఆ బస్సులోవాళ్ళు చూసింది అనుకుంది. కిటికీలో కూర్చుని కృష్ణమూర్తి పార్వతి ఏ సెనక్కాయిలో కాబోలు తింటూ నవ్వుకుంటున్నారు. "ఎంత భార్యాభర్తలయితేమటుకు అంత దగ్గరగా కూర్చోవాలా వం?" అనుకుని తన ఉనికిని గుర్తించేలా చేయాలని ఓ చిన్న దగ్గు దగ్గింది. సుందరాంగి బెదరిపోయింది. "పార్వతి! చూడు పక్కింటి గాజుబొమ్మ వచ్చింది." "నేనిలా వస్తే దకుసు

కుంటుంది. నువ్వెళ్ళి పలకరించు." అంటూ కృష్ణమూర్తిని తోసింది. ఇవతలికి వస్తూనే "నమస్కారం" రండి అంటూ కుర్చీ చూపించాడు.

"ఆవిడేరి. పలకరించి పోదామని వచ్చాను. కొత్త నవలేదేనా రాస్తున్నారా?" కుతూహలంగా అడిగింది. "నవలా? రాయడామా? నాకు తెలియదే పార్వతి రాస్తుందని" ఆశ్చర్యం ప్రకటించి పార్వతీ అంటూ కేక వేశాడు.

"ఓ సారి ఇంకా స్నానం చేయలేదు." అంటూ నవాలక్ష క్షమార్పణలు చెప్తూ వచ్చి నిలబడింది పార్వతి.

"మీరేకదూ గాజుబొమ్మ నవల రాశారు. చాలా నచ్చింది నాకు. కొత్తదేం రాయలేదేం."

పార్వతికి ఓ క్షణంపాటు ఏమిటి అంటోందో అర్థం కాలేదు. తరువాత చిలిపితనంలో చేప పిల్లల్లా కళ్ళు మెరిశాయి.

"సారీ నేను పార్వతీ కృష్ణమూర్తిని. మీరు అడుగు నున్నది సుభద్రా కృష్ణమూర్తిని గురించి అవునా?" నవ్వుతూ అడిగింది.

"అదీ కథ. పార్వతికి ఉత్తరం రాయడమేరాదే. నవలెప్పుడు రాసిందబ్బా అనుకున్నాను. మైగాడ్" అంటూ పార్వతి భుజంపై చెయ్యి వేశాడు కృష్ణమూర్తి.

సుందరాంగి లేచి నిలబడింది. "సారీ నాది పొరపాటు" అంటూ వెనక్కి తిరిగి చూడకుండా పరుగెత్తింది. "వెనక్కి చూడకు చిట్టితల్లీ దడుసు కుంటావు?" అంటూ పార్వతిని కౌగిట చేర్చుకుని అలాగే లోపలికి నడిపించుకు పోయాడు కృష్ణమూర్తి. ఇద్దరి నవ్వులూ ఆ ప్రశాంత వాతావరణంలో

వింతగా మధురంగా విన్పిస్తున్నాయి. "నిన్ను రాయనివ్వను పార్వతీ, అంతా నిన్ను ఆరాధిస్తే నేను భరించలేను" అంటూ పార్వతి గుండెల్లో తల దాచుకున్నాడు కృష్ణ మూర్తి.

"నేనేదో విన్నది అంటే నువ్వు పరుగెత్తాలా?" కసురు కుంటున్నాడు సుందరాంగి భర్త. అతని కోపంలో కూడా చిరునవ్వు కన్పిస్తోంది.

"సరదా అయినవాళ్ళు పల్కరిస్తే ఏం పోయింది" అంటూ పేపరుల్లో తల దూర్చాడు.

"సరదా ఏమిటి నా ముఖం. ఛీప్ పీపుల్ యిక్కడ వాళ్ళుంటే మనందరికీ సిగ్గు నువ్వెలాగా సుఖంగా ఉండలేవు. ఉండనియ్యను ఆ కృష్ణమూర్తినేనా ఉండనియ్యి. ఎందుకంత జెలసీ!"

"నాకా కంట్రీ బ్రూట్‌ని చూసి జెలసీనా" అంటూ చెదరిన ముంగురులు సవరించుకుంది సుందరాంగి.

కిటికీలోంచి పక్కింటి కేసి చూసిన పార్వతి పక్కింటి భర్తమీద సానుభూతి ప్రకటిస్తూ "చూశావా కృష్ణా అవిడ అయన్ని కోప్పడుతోంది" అంది.

"కోప్పడం లేదు పార్వతీ, ఇల్లు పూర్వమంటుంది" నవ్వుతూ కిటికీ రెక్క మూశాడు కృష్ణమూర్తి.

---